బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి కృషి



గోదాం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం కృషి చేసినట్లు ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలంలోని మల్కారంలో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం, సొసైటీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.1.23 కోట్ల నిధులతో గోదాం, కార్యాలయం భవనం నిర్మించామన్నారు. గోదాం నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించడంతో పాటు నిధుల మంజూరుకు అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులు గోదాంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారంలో లేకున్నా బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యకర్తలు అధైర్యం పడవద్దని, తాను ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, సొసైటీ చైర్మన్ బి. సతీష్, సర్పంచ్ మాధవి, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి



తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేస్తున్న కేబీ.దొడ్డి స్థానికులు

శంషాబాద్ రూరల్: మండలంలోని కేబీ.దొడ్డి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని స్థానికులు బుధవారం తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 1లో ఎకరా 17 గుంటల భూమి ఉండగా.. ఇందులో 38 గుంటల భూమిని పట్టాదారులు ఎల్కచెర్ల బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి 1976లో స్థానికుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి రాసిచ్చినట్లు తెలిపారు. అయితే ఈ భూమిని కొంత మంది నకిలీ పత్రాలతో కాజేసి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర ఎకరం భూమిని తమ పేర్లతో నకిలీ పత్రాలు సృష్టించిన కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని గ్రామస్తుల అవసరాల కోసం కేటాయించాలన్నారు.

మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, తదితరులు

శంషాబాద్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం జరిగిన మండల మహాపడి పూజ భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. పడి వందనం కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అయ్యప్పసేవాసమితి వ్యవస్థాపకులు ఆర్. గణేష్‌గుప్తా, అధ్యక్షుడు బండిగోపాల్ యాదవ్‌లు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు అజయ్, మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



అత్తాపూర్: ఎలాంటి అనుమతులు లేకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పరిశ్రమలు, దుకాణాలలో వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎంఎం పహాడీలో చింతల్‌మెట్‌కు చెందిన ముజీబ్, ముజాహిద్ అహ్మద్‌లు స్క్రాప్ దుకాణంతో పాటు సోఫాలు తయారు చేసే పరిశ్రమను ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండ కొనసాగిస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున విద్యుత్ ప్రమాదంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో షాపులోని రూ.20నుంచి 25లక్షల విలువ చేసే సామాగ్రి కాలి బూడిదయ్యిందన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైరింజన్‌లతో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. గృహ సముదాయాల మధ్య అగ్ని ప్రమాదం జరగటంతో చుట్టుపక్కల వారు శ్వాస ఆడక ఉక్కిరి, బిక్కిరి అయి పరుగులు పెట్టారు. ఇలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో పాటు రూ.100 చెల్లించి జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ప్రజాపాలన’ పకడ్బందీగా



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్



దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన నార్సింగి కమిషనర్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల దరఖాస్తులో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారిని గుర్తించి సహకరించాలని సూచించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం వంటి పథకాల కోసం దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. అధికారులు ప్రత్యేక కార్యచరణతో, ప్రణాళికతో ముందుకు సాగాలని వివరించారు. కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మణికొండ: గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలను అమలులోకి తెచ్చే క్రమంలో పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. అందులో భాగంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో ప్రజాపాలనలో భాగంగా గురువారం నుంచి మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తులను తీసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే దరఖాస్తుల స్వీకరణ జనవరి నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఆయా పథకాలకు అవసరమైన ధృవపత్రాలు, గుర్తింపు కార్డులను దరఖాస్తు పత్రానికి జత చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ కుర్చీలు, తాగునీరు, టెంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. జంట మున్సిపాలిటీలలో కమిషనర్‌లు కె. ఫల్గుణ్‌కుమార్, బి.సురేందర్‌రెడ్డిలు రోజంతా వార్డు అధికారులకు అవగాహన కలిస్తూ, వార్డు కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ మేనేజర్‌లు రమేష్, యోగేశ్‌లతో పాటు అధికారులు, పాల్గొన్నారు.

శంషాబాద్: ప్రభుత్వం ప్రకటించిన వివిధ పథకాలను సద్వినియోగం చేసుకునే దిశగా గురువారం నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో ‘ప్రజాపాలన’ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు అధికారులు, ప్రజాప్రతినిధుతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ప్రజాపాలనలో స్వీకరించే దరఖాస్తులు, దరఖాస్తు దారులకు చేయాల్సిన సహాయసహకారాలను గురించి తెలిపారు. అన్ని వార్డు కార్యాలయాల్లో ఉదయం 8 నుంచి 12 తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే విజయం



ఎంపీకి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకంక్షలు తెలుపుతున్న పలుగుచెరువు మహేష్

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల పార్లమెంట్‌లోని ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌కు తిరుగు లేదని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు ఎంపీ రంజిత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవార తన నివాసంలో రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పలుగుచెరు మహేష్ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి బీఆర్ఎస్ నాయకులతో కలసి క్రిస్మస్ శుభాకంక్షలు తెలిపారు. వీరితో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు మలాకిరత్నం ఆధ్వర్యంలో మెథడిస్టు చర్చి దైవ సేవకులు రెవరెండ్ విల్సన్ కుమార్ క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయనను దీవించారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం రంజిత్ రెడ్డికి మరో మారు చేవెళ్ల పార్లమెంటు టికెట్ కేటయించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను గెలిపించినట్లే తనను కూడా గెలిపించాలని కోరారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాలలోకి వచ్చాను సేవ చేసే భాగ్యం కల్పించాలని ప్రజలను కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాగృతి కన్వీనర్ రగడంపల్లి శ్రావణ్‌కుమార్, అనుముల జాన్‌పాల్ ,ఎడ్లకాడి సూర్యం , పలుగు చెరువు మహేందర్, ఆరింట్ల విశాల్, వడ్లకొండ సురేష్, ఇటికాల క్రిష్ణ, గోల్కొండ రాజ్‌కుమార్, బర్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

రాజేంద్రనగర్: మారుతి సుజికి కారు డిక్కిని మాడిఫై చేసి అందులో అక్రమంగా 80 కిలోల గంజాయిని తరలిస్తున్నవారిని రాజేంద్రనగర్ పోలీసులు ఎస్‌ఓటి పోలీసుల సహాయంతో పట్టుకుని, కారును ఇద్దరు ఇందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డివిజన్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మి పెరముల్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక ప్రాంతానికి చెందిన రవి, రామ్ శివపూరిలు స్నేహితులు ఇద్దరు కలిసి విశాఖపట్నంతో పాటు వివిధ ప్రాంత్రాల నుంచి గంజాయిని కొని కర్ణాటక లోని ఉద్గీర్ ప్రాంతానికి తరలించి అక్కడ విక్రహించెవారు. తెలంగాణలో మాదకద్రవ్యాలు, గంజాయి పై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. దీంతో రవి ఒరిస్సా నుంచి ఒక కారును తెప్పించి కారు డిక్కి లో మార్పులు చేసి దాని వెనుకాల 80 కీలోల గంజాయి ప్యాకెట్లలో ట్యాగ్ చేసి అనుమానం రాకుండ దాచి పెట్టారు. ఈ గంజాయిని విశాఖపట్నం నుంచి ఉద్గీర్ ప్రాంతానికి తరలించేందుకు నగరంలోని కోటి ప్రాంతానికి చెందిన డ్రైవర్ అనిల్, గచ్చిబౌలి ప్రాంతంలో డెలివరీ బాయ్‌గా చేస్తున్నా మహాదేవ్‌లకు డబ్బులు ఆశ చూపి కర్ణాటక లోని ఉద్గీర్ ప్రాంతానికి కారును తీసుకవస్తే 50 వేల ఇస్తానన్ని ఇద్దరిని ఒప్పించారు. వీరు ఇద్దరు ఈ నెల 26 న విశాఖపట్నంకి వెళ్లి, అక్కడ కారును తీసుకోని ఎక్కడ టోల్‌గేట్లు చెకింగ్‌లు లేని దారులను ముందే చూసుకుని బయలుదేరారు. గురువారం ఉదయం హిమాయత్ సాగర్ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే ఈ ప్రాంతంలో చెకింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ పోలీసులతో పాటు ఎస్‌ఓటీ పోలీసులు ఈ కారును తనిఖీ చేశారు. డిక్కిని తెరిచి చూడగా ఎలాంటి అనుమానం రాలేదు. కానీ చివరకు డిక్కి వెనుక భాగం లో మార్పులు చేసిన్నట్లు అనుమానం రావడంతో కారు డిక్కిని మారో సారి తనీఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. వాటిని లెక్కించగా 58 ప్యాకెట్లు ఉన్నటు తెలిపారు. కారులో ఉన్న అనిల్, మహాదేవ్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఏ1 ఏ4 నిందితులిద్దరు పరారీలో ఉన్నట్లు అదనపు డీసీపీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన రాజేంద్రనగర్ పోలీసులతో పాటు ఎస్‌ఓటీ పోలీసులను డీసీపీ అభినందించారు.

నృత్యానందం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్‌మేళాలో భాగంగా బుధవారం దుర్గేష్ నందిని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో బ్రహ్మాంజలి, నటేశకౌతం, జతిస్వరం, కాలభైరవాష్టకం అంశాలను ప్రదర్శించారు. ప్రణవి తుమ్మటి శిష్యబృందం మూషిక వాహన, ముద్దుగారే యశోద, మరకతమణిమయ, రామదాసు కీర్తన, లింగాష్టకం, కృష్ణం కలయసఖి , గరుడ గమన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

ముగ్గుల పోటీలు

హఫీజ్‌పేట్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని, పారిశుద్యాన్ని, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ముగ్గులు అని అన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్తు తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్పన, సరోజ, సర్వసతి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, విష్ణు ప్రసాద్, జనార్ధన్, మహిళా నాయకురాలు వాణి సాంబశివావు, రొటేరియన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ అవార్డు విజేత



అవార్డు అందుకుంటున్న సీనియర్ సైంటిస్ట్ నిర్మల

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సైంటిస్ట్ ఎం. నిర్మల యంగ్ సైంటిస్ట్ (2023) అవార్డుకు ఎన్నికైన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ సెంటిస్ట్ అవార్డుల ప్రధానోత్సవంలో నిర్మల ఈ అవార్డును అందుకున్నారు.

నూతన అధ్యక్షుడి ఎన్నిక



గోపాల్‌యాదవ్

శంషాబాద్: శంషాబాద్ అయ్యప్ప దేవాలయం నూతన అధ్యక్షుడిగా మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్ నియమితులయ్యారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతు అయ్యప్ప దేవాలయం అభివృద్ధితో పాటు సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు నూతన అధ్యక్షుడు బండి గోపాల్‌యాదవ్ తెలిపారు.

పెద్దగుట్టలో ఉర్సు ఉత్సవాలు



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలోని బాబా ఫక్రుద్దీన్ హౌలియాన్ దర్గా (పెద్ద గుట్ట)లో గురువారం నుంచి ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ముత్తావలి మహమ్మద్ మునీర్ సాహెబ్ ఖాద్రి తెలిపారు. గురువారం గంధం ఉత్సవాలు, శుక్రవారం ఉర్సు ఉత్సవాలు ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నూతన సంవత్సర వేడుకలు.. ఆంక్షలు

రాయదుర్గం: నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా బుధవారం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పరిమితులు, మార్గదర్శకాలను జారీ చేశారు. సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి ఆదేశాలపై సైబరాబాద్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ పలు మార్గదర్శకాలను విడుదల చేశారు.

క్యాబ్‌లు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలి

క్యాబ్లు, టాక్సీ, ఆటో డ్రైవర్లు, ఆపరేటర్లు ఖచ్చితంగా యూనిఫామ్ ధరించాలి. అన్ని డాక్యుమెంట్లను తమ వెంట ఉంచుకోవాలి, క్యాబ్ డ్రైవర్లు ఎలాంటి పరిస్థితులలోనూ రైడ్ నిరాకరించ కూడదు, ఇది మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 178 ప్రకారం ఉల్లంఘనకు పాల్పడితే బండి నెంబర్, సమయం, ప్రదేశం మొదలైన వివరాలతో వాట్సాప్ 9490617346కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలతో అనుచితంగా ప్రవర్తించకూడదు లేదా అదనపు చార్జీలు డిమాండ్ చేయరాదు.

బార్లు/పబ్/క్లబ్‌లకు సూచనలు..

- ఏదైనా బార్/పబ్/క్లబ్‌లు తమ ప్రాంగణంలో మద్యం సేవించిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.
- ప్రజలు ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా నడపడం ..నిబంధనలు ఉల్లంఘిస్తే వారిని గుర్తించేందుకు ప్రత్యేక కెమెరాలు అమర్చడం జరిగిందని వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
- సైబరాబాద్ పరిధిలోని అన్ని రహదారులపై రాత్రి 8 గం నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తారు
- సరైన పత్రాలు సమర్పించని పక్షంలో వాహనాలను తాత్కాలికంగా పోలీసు వారు స్వాధీనం చేసుకుంటారు.
- మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు
- వాహనాలలో అధిక డెసిబుల్ సౌండ్/మ్యూజిక్ సిస్టమ్‌ను ఉపయోగించరాదు.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు 2023 లీడర్‌షిప్ అవార్డు



లీడర్‌షిప్ అవార్డును అందుకున్న అధికారులు

ఏజీవర్సిటీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్‌పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) అగ్రికల్చర్ టుడే గ్రూప్ ద్వారా డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ 2023 అవార్డు అందుకున్నది. న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీ. సదాశివం చేతుల మీదుగా ఈ అవార్డును ఎన్ఐఆర్‌డీపీ అధికారులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 1958లో స్థాపించబడి ఎన్ఐఆర్‌డీపీఆర్ ఆరు దశాబ్దాలకు పైగా గ్రామీణ భారతదేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విశేషమైన కృషి చేసిందని అన్నారు. లక్షలాది మంది గ్రామీణ ప్రజల జీవితాలను సానుకూలంగా స్పృశించిన పనికి ఈ అవార్డు లభించదని అన్నారు. గ్రామీణ భారతదేశ జీవన నాణ్యతలో సమగ్రమైన, స్థిరమైన మెరుగుదలని సాధించడం పై దృష్టి సాధించడం, వాటదారుల సామర్థ్యాని పెంపొవదించడం, సంస్థ వనరులను పరిరక్షించడం జరిగిందని అన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ 16వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టింకురెడ్డి కోరారు. ఈ మేరకు కాలనీ ప్రెసిడెంట్ పిసిజిచారితో కలిసి కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టింకురెడ్డి మాట్లాతూ రోజు రోజుకు వీధి కుక్కల బెడద అధికంగా మారుతుందన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులను టార్గెట్‌గా చేసుకోని దాడులకు ఎగబడుతున్నాయన్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై వెంటనే స్పందించి వీధి కుక్కలను పట్టుకోని తరలించాలని కోరారు. ఈ అంశం పై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి వి.సురేందర్ తదితరులున్నారు.

ఏవీఎస్ రెడ్డి జయంతి వేడుకలు



ఏవీఎస్‌రెడ్డికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: నిరుపేదల కోసం ఏవీఎస్ రెడ్డి చేసిన సేవలు మరవలేనివని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. బుధవారం ఏవిఎస్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ మానసాహిల్స్ ఏవిఎస్ రెడ్డి నగర్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిరుపేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్న కాలంలో వారికి పక్కా ఇళ్లు నిర్మించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన పేరుపై కాలనీ ఏర్పాటు చేసి ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవిఎస్ నగర్ కాలనీ వాసులతో పాటు అంజయ్యగౌడ్, కరణం నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాజలింగం

గోల్కొండ: పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చునని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజలింగం అన్నారు. తెలంగాణ ఫెడరేషన్‌కు నూతనంగా నియమితులైన వారికి ఆయన బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి జాతీయ ప్రాంతీయ పార్టీల వారు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. అంబేడ్కర్ ఆశయాలను పూర్తి చేయడానికి మనమంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.జగన్నాథం, పి.కన్నయ్య, ఎన్.విల్సన్, ఎస్.మాలాద్రీ, యూ.గీతారాణి, ఎం .అశోక్‌కుమార్, కొమ్ము వరలక్ష్మి తదితరులున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

గచ్చిబౌలి: వరద నీటి డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలోట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు మాదాపూర్ ఇంచార్జ్ ట్రాఫిక్ డీసీపీ డీవీవీ శ్రీనివాసరావు తెలిపారు. మణికొండలో సన్‌రైజ్ రెగ్యులాస్ వద్ద వరద నీటి డ్రెయిన్, సీసీ రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో రోడ్డును మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి జనవరి 17వ తేదీ వరకు పనులు జరుగుతాయని తెలిపారు. మణికొండ మర్రి చెట్టు నుంచి రాయదుర్గం వైపు వచ్చే వాహనదారులు పంచవటి కాలనీ, మల్కంచెరువు, లింక్ రోడ్డు, ఓల్డ్ ముంబై జాతీయ రహదారికి వెళ్లాలని సూచించారు. రాయదుర్గం నుంచి మణికొండ మర్రిచెట్టు వైపు వెళ్లే వాహనాలు ట్రయల్ విల్లాస్ పక్క రోడ్డులో వెళ్లి హుడా కాలనీ మెయిన్‌రోడ్డు, శ్రీజాస్ హోమ్ ఫుడ్ వద్ద కుడి వైపు తిరిగి షేక్‌పేట్ ప్రధాన రహదారికి చేరుకుంటారు. మణికొండ ఆంధ్రా బ్యాంక్ వద్ద రైట్ టర్న్ తీసుకొని మర్రిచెట్టు రోడ్డుకు వెళ్లవచ్చన్నారు. ట్రాఫిక్ మళ్లింపును వాహనదారులు గమనించాలని ఆయన సూచించారు.